ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 04 అక్టోబర్ 2026

### పలు రకాల చాక్లెట్‌తో అలంకరణ

# స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి



గోపవరం. అక్టోబర్ 3. ప్రభాతవార్త.

గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామికి భాద్రపద మాసం మూడవ శనివారం పూజాభిషేకాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది,స్వామివారికి చాక్లెట్ తో ప్రత్యేక అలంకరణ కార్యక్రమాన్ని చేశారు,ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు కన్నుల పండుగ దర్శించుకున్నారు, భక్తులు మాట్లాడుతూ మాకు అనారోగ్య సమస్యలు, చీడ,పీడ గ్రహ దోషాలు,అనుకున్న సమయంలో తొలగిపోతుంది అని తెలిపారు,10/09/2026 వ తేదీన మాలాయలు మరియు అమావాస్య శనివారం ఒకే సారి రావటం అందుకోసం స్వామి వారికి తులసి తీర్థం తో అభిషేకం ఉంటుంది అని ప్రతి ఒక్కరు అభిషేకం లో పాల్గొనడం వలన పూర్వ జన్మ పితృ శాప దోషాలను తొలగించుకోండి అని స్వామి వారు తెలిపారు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినారు,ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# 5న ప్రొద్దుటూరులో జరిగే ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయండి : ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :

ఈ నెల 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలకాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కోరారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన ఎన్నికల హామీలతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ పర్యటన జరుగుతోందని తెలిపారు. సభకు ప్రజలను తరలించేందుకు డబ్బులు ఇస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి..

## అధికారులకు సూచనలిచ్చిన మంత్రులు నారాయణ, ఎస్. సవిత, బీసీ జనార్దన్ రెడ్డి



ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ ఈ నెల 5న ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లు సూచించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతోకలిసి మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్షుణ్ణంగా వివరించారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేసినట్లు, ఒకేసారి రెండు హెలికాప్టర్లు దిగే విధంగా రెండు హెలీప్యాడ్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. హెలీప్యాడ్ పరిసరాల్లో భద్రత, రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో జల జీవన్ మిషన్‌కు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా రూ. 30 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్ వివరించారు. అమృత్ నగర్ వద్ద హెలీప్యాడ్, అదే రోడ్డులో సర్కిల్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా రూ. 30 వేళా కోట్లతో చేపట్టే "జల జీవన్ మిషన్" పనుల పైలన్, శిలాఫలకం నిర్మాణంను, ప్రొద్దుటూరు బైపాస్ – జమ్మలమడుగు మార్గంలో ఏర్పాటు చేస్తున్న ప్రజావేదిక సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు.సభా ప్రాంగణంలో గ్యాలరీలు, భద్రత, నాయకుల లైన్ అప్, బారికేడ్లు, వాహనాల రాకపోకలు, పారిశుద్ధం, తాగునీరు తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రులు సూచించారు. ముఖ్యమంత్రి నిర్వహించనున్న పార్టీ శ్రేణుల సమావేశానికి సంబంధించి కూడా భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సీఎం కార్యక్రమ సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి, భూపేష్ రెడ్డి, జేసీ డా. నిధీమీనా, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి లో తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌పీడీసీఎల్, పీఆర్, పోలీస్ శాఖల అధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనాతో కలిసి హెలీప్యాడ్, సభా ప్రాంగణం, జల్‌జీవన్ మిషన్ పనుల ప్రాంతాలను సందర్శించారు. అమృతనగర్ హెలీప్యాడ్, కొర్రపాడు రోడ్డు సర్కిల్‌లోని జల్‌జీవన్ మిషన్ పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బైపాస్‌జమ్మలమడుగు మార్గంలోని ప్రజావేదిక సభా ప్రాంగణంలో గ్యాలరీలు, భద్రత, నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. పార్టీ కేడర్ సమావేశ స్థలంలోనూ భద్రతా చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, భూపేష్‌రెడ్డి, ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే సిఎం సభ విజయవంతం

## ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :

హార్టికల్చర్ హబ్ శంకుస్తాపన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కార్యకర్తల కృషే నంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, రిలయన్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీల సభ విజయవంతం కావడంపై టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.లక్షకోట్లతో హార్టికల్చర్‌హబ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తే బహిరంగ సభకు లక్షమంది రావడం అభినందనీయమన్నారు. హార్టికల్చర్ హబ్‌తో మదనపల్లెకు దేశంలోనే గుర్తింపు లభించిందన్నారు. అనంత్ అంబానీ మదనపల్లెపై చూపిన ప్రేమ ఎనలేనిది అన్నారు. తనను మీ బిడ్డగా ఆశీర్వదించండి అంటూ ఆయన చెప్పిన మాటలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకొన్నాయన్నారు. మదనపల్లె అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఇక అన్ని విధాల్లో ముందుంజులో ఉంటుందన్నారు. సిఎం సభ విజయవంతంలో రామసముద్రం, నిమ్మనపల్లె, రూరల్ మండలం, మదనపల్లె అర్బన్‌ల్లో వారి వారికి కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించినందుకు అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్, ఎస్‌ఎ. మస్తాన్, ఎస్‌ఎం.రఫి, నరసింహులు, నీలకంఠ, మోడెం సిద్దప్ప, రైస్‌మిల్ శశి, చింతమాను రెడ్డప్పరెడ్డి, నవీన్‌చౌదరి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

## 30కి పైగా కేసులు ఉన్నట్లు గుర్తింపు

## భారీ చోరీ కేసును ఛేదించిన బద్వేలు రూరల్ పోలీసులు



పట్టుబడిన నిందితుడు (ఫైల్ ఫోటో)

బద్వేలు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త

బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేశారు. గోపవరం మండలం మడకలవారిపల్లికి చెందిన చిట్టిబోయిన చెన్నయ్య కుటుంబంతో కలిసి తిరుపతికి వెళ్లిన సమయంలో 2025 జూలై 5/6 రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.1.80 లక్షల నగదు, 4.6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కలిపి మొత్తం రూ.3.25 లక్షల విలువైన సొత్తును అపహరించారు. ఈ ఘటనపై బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 68/2026, బీఎన్‌ఎస్ సెక్షన్లు 331(4), 305 కింద కేసు నమోదైంది. వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణయ్య, ఎస్ఐ టీవీఎన్. చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 3న మధ్యాహ్నం 1.55 గంటలకు బద్వేలు–సిద్ధవటం రోడ్డులోని బయనపల్లి సబ్‌స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నెల్లూరుకు చెందిన కరణం కుమార్ అలియాస్ గొల్ల కుమార్ (35)ను అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి వెంకటేశ్వర స్వామి బొమ్మతో కూడిన బంగారు ఉంగరం, లేత పచ్చరంగు రాయితో కూడిన బంగారు ఉంగరం, రెండు చిన్న వెండి దీపపు సెమ్మెలు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 30కి పైగా చోరీ కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు క్రిమినల్ సిండికేట్‌గా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించడంతో కేసులో బీఎన్‌ఎస్ 111 సెక్షన్‌ను కూడా చేర్చారు. భారీ చోరీ కేసును ఛేదించిన బద్వేలు రూరల్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# పిల్లనిచ్చిన మామనే కడతేర్చిన అల్లుడు

## లింగాల మండలం మురారి చింతలలో విషాద ఘటన

## పరారీలో నిందితుడు



పులివెందుల, అక్టోబర్ 3 ప్రభాతవార్త :

పిల్లనిచ్చిన మామనే అల్లుడు కడ తేర్చిన ఘటన పులివెందుల నియోజక వర్గంలో కలకలం లేపింది. భార్యను పుట్టింటి నుంచి తన వెంట పంపించాలంటూ వచ్చిన అల్లుడు, మామపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో మామ మృతి చెందిన విషాద ఘటన లింగాల మండలం మురారి చింతల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసు కుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన అంకే రాజబాబు (46) మృతి చెందాడు. దాడికి పాల్పడిన అల్లుడు ప్రదీప్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం మురారి చింతల గ్రామానికి చెందిన అంకే రాజబాబు కుమార్తెకు వేంపల్లె ప్రాంతానికి చెందిన ప్రదీప్‌తో వివాహం జరిగింది. కొంతకాలంగా అల్లుడు వేధిస్తున్నాడనే కారణంతో వారం రోజుల క్రితం కుమార్తెను రాజబాబు పుట్టింటికి తీసుకొచ్చినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో ప్రదీప్ మరో వ్యక్తితో కలిసి మురారి చింతల గ్రామానికి వచ్చాడు. భార్యను తనతో పంపించాలని కోరుతూ మామ రాజబాబుతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పంపించడం కుదరదని, ఉదయం మీ తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత విషయాన్ని పరిష్కరిద్దా మని రాజబాబు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆగ్రహానికి గురైన ప్రదీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజబాబుపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో రాజబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆయనను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటన అనంతరం నిందితుడు ప్రదీప్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## తూగుట్ల మధుసూదన్‌రెడ్డి చొరవతో డ్రైనేజి పనులు



డ్రైనేజ్ పనులను పర్యవేక్షిస్తున్న తూగుట్ల మధుసూదన్ రెడ్డి

పులివెందుల, అక్టోబర్ 3 ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వెనుక వైపు వీధిలో చాలాకాలంగా నెలకొన్న డ్రైనేజీ, మురుగు నీటి సమస్యకు టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మధుసూద న్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవల కురిసిన వర్షాల సమయంలో మురుగు కాలువ పొంగిపొర్లడంతో కలుషిత నీరు ఇళ్లలోకి చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులను అక్కడికి పిలిపించి నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టించారు.అయితే వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దగ్గరుండి డ్రైనేజీ ఛాంబర్ ఏర్పాటు చేయించడంతో పాటు, మురుగు కాలువ నుంచి నీరు ఇళ్ల వైపు ప్రవహించకుండా రక్షణ గోడ నిర్మించారు. అదేవిధంగా మురుగు నీరు సక్రమంగా కాలువలోకి వెళ్లేలా పైపులైన్‌ను ఏర్పాటు చేయించారు.దీంతో వర్షాల సమయంలో ఇళ్లలోకి మురుగు నీరు చేరే సమస్యకు అడ్డుకట్ట పడిందని స్థానికులు తెలిపారు. తమ ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించి, దీర్ఘకాలిక పరిష్కారం చూపించిన తూగుట్ల మధుసూదన్‌రెడ్డికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో 28వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి, ఫిజియోథెరపీ డాక్టర్ సాయి కిషోర్, శ్రీనివాసులు, నామా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

## విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ వెలికి తీసేందుకే స్కూలు గేమ్స్ ఎంపికలు

## టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి



జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:

విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే అండర్–14,17 విభాగాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను బాల బాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని పీఆర్ ప్రభుత్వ హైస్కూలు క్రీడా మైదానంలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు స్కూలు గేమ్స్ ఎంపికలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని భవిష్యత్తులో క్రీడల కోటాలో విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రాయితీ లభిస్తుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల వల్ల కలిగే ప్రయోజనం వివరించారు. ఈ క్రీడల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి మంచిపేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, డివిజన్ పరిధిలోని విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగునీరు లేక చీనీ తోటల

# బతుకు చిద్రమ్!

### ఎలినో ప్రభావంతో వర్షాలు లేక..

### గండికోట జలాశయం ఉన్నా పొలాలకు చుక్కనీరు కరువు

### రూ.7 లక్షల విలువైన చీనీ తోటను జేసీబీ సహాయంతో తొలగించిన రైతు



ముద్దనూరు, అక్టోబర్ 03: ప్రభాతవార్త

ఎలినో ప్రభావంతో వర్షాలు లేక వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, మరోవైపు సాగునీరు అందకపోవడంతో ముద్దనూరు మండలంలోని చీనీ రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. గండికోట జలాశయం సమీపంలోనే ఉన్నప్పటికీ తమ పొలాలకు సాగునీరు అందక పంటలు, తోటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన రైతు మోపూరి చెన్నకేశవ రెడ్డి మూడు ఎకరాల్లో సాగు చేసిన చీనీ తోటకు సరిపడా నీరు అందక చెట్లు ఎండిపోవడంతో సుమారు రూ.7 లక్షల విలువైన తోటను చివరకు జేసీబీ సహాయంతో చెట్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోర్లలో నీరు అందక తోటను కాపాడుకోలేకపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పెంచిన చీనీ చెట్లను జేసీబీతో తొలగించడం రైతు ఎదుర్కొంటున్న సాగునీటి సంక్షోభానికి అద్దం పడుతోంది. గంగాదేవిపల్లి, యామవరం, మంగపట్నం, కమ్మవారిపల్లె, ముద్దనూరు, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాల్లోనూ వర్షాలు లేక బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో రైతులు సాగును కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఒకవైపు గండికోట జలాశయం సమీపంలోనే ఉన్నా, మరోవైపు తమ పొలాలకు నీరు అందక పెట్టుబడులు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మండలంలోని చెరువులకు జలాశయం నుంచి నీటిని అందించే అవకాశాలను పరిశీలించి వాటిని నింపితే భూగర్భజలాలు పెరిగి బోర్లపై ఆధారపడుతున్న రైతులకు కొంత ఉపశమనం కలుగుతుందని వారు కోరుతున్నారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలు, ఉద్యాన తోటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని నమోదు చేయాలని, అర్హత ఉన్న రైతులకు నిబంధనల ప్రకారం పంట నష్టపరిహారం, ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే గండికోట జలాశయం నీటిని అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల ద్వారా ఆయా ప్రాంతాలకు అందించే మార్గాలను పరిశీలించి తాత్కాలిక ఉపశమనంతో సరిపెట్టకుండా శాశ్వత సాగునీటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని రైతులు కోరుతున్నారు. రైతుల పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, ఇకపై సాగునీరు లేక రైతులు తమ చేతులతోనే చీనీ తోటలను తొలగించాల్సిన పరిస్థితి రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైతు మోపూరి చెన్నకేశవ రెడ్డి

# పూలే దంపతుల విగ్రహాలకు ఘన నివాళులు



ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 3, ప్రభాతవార్త:

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను బీజేపీ ఓబీసీ మోర్చా నాకులు నీటితో శుభ్రం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా బుర్ర రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముప్పే వెంకట్ నాయుడులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, జిల్లా కార్యదర్శి చిరంజీవిరెడ్డి, చలపతిరావు, బీజేపీ సీనియర్ నాయకులు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు సంజీవరాయుడు, హరి యాదవ్, అఖిల, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కుమారి రెడ్డి, ప్రసన్న, పట్టణ ఉపాధ్యక్షురాలు సంజీవరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 18వ రోజుకు చేరిన వీఆర్‌ఏల సమ్మె

దువ్వూరు, అక్టోబర్ 03, ప్రభాతవార్త:

తమ డిమాండ్ల సాధన కొరకు మండలంలోని వీఆర్‌ఏలు చేస్తున్న సమ్మె శనివారానికి 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కొరకు 18 రోజుల నుండి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. వివిధ రూపాల్లో తమ నిరసనలు తెలియజేశామని అయినా కనీసం స్పందన కూడా రావడం లేదని పేర్కొన్నారు. తమకు పే స్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని నామిని వీఆర్‌ఏలకు రెగ్యులర్ చేయాలని కోరుతూ వారు నిర సన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్, దస్తగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచే ఏపీ ఎంహెచ్‌సీ జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె పోరు



మదనపల్లెక్రైం, అక్టోబర్ 3 ప్రభాతవార్త.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ !! హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ ఎంహెచ్‌సీ జేఏసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సుమారు 14,600 మంది కాంట్రాక్ట్ సిబ్బంది (స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు తదితరులు) తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచే (అక్టోబర్ 04) నుంచి దశలవారీ సమ్మెకు పిలుపునిచ్చారు. మదనపల్లె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గారికి సమర్పించిన వినతిపత్రంలో తమ డిమాండ్లను స్పష్టం చేస్తూ, ఉద్యోగులందరినీ ఎటువంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని (రెగ్యులరైజ్ చేయాలని), తగ్గించిన వేతనాలను సవరించి 100!! గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించాలని మరియు కొత్త నియామకాల కంటే ముందు ప్రస్తుత కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో జేఏసీ ప్రకటించిన కార్యాచరణ ప్రకారం: అక్టోబర్ 04న ఆన్‌లైన్ వర్క్ !! పెన్‌డౌన్ నిరసన, అక్టోబర్ 05న శాంతియుత నిరసనతో పాటు జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పణ, అక్టోబర్ 06న అత్యవసర సేవలు మినహాయించి సాధారణ విధుల బహిష్కరణ చేపడతారు. ఇక చివరిగా అక్టోబర్ 07వ తేదీన అత్యవసర సేవలతో సహా అన్ని రకాల సేవలను పూర్తిగా బహిష్కరించి కాంట్రాక్ట్ సిబ్బంది అందరూ నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరుతూనే, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని జేఏసీ నేతలు హెచ్చరించారు.

## గర్భవతులు మంచి ఆహారాన్ని తీసుకోవాలి



చక్రాయపేట అక్టోబర్ 3 ప్రభాతవార్త:
గర్భవతులు మంచి ఆహారాన్ని తీసుకోవాలని చక్రాయపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఊర్మిళ రెడ్డి పేర్కొన్నారు శనివారం ఈ కార్యక్రమంలో భాగంగా సేవ సంకల్ప అభినయ్ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు ఇందులో గై ని కాలేజీ డాక్టర్ ప్రియాంక 30 మంది గర్భవతులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు అంగన్వాడి సిబ్బంది కౌశిక స్టోర్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకయ్య, సిహెచ్ఓలు మునిరా, గౌసియా, ఏఎన్ఎంలు నాగరతమ్మ, అంజనమ్మ, ఆశవర్కర్లు అంగన్వాడి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## వెలుగు కార్యాలయంలో విషసర్పం కలకలం



చౌడేపల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన చౌడేపల్లిలోని వెలుగు కార్యాలయంలోకి విష సర్పం ( నాగుపాము) ప్రవేశించింది ఏపీఎం గదిలోని ఓ బీరువాకిందుకు దూరడంతో అక్కడే ఉన్న మహిళలు అధికారులు కేకలు వేస్తూ వెలుపలికి పరుగులు తీశారు స్థానికులు దానిని వెలుపలికి తరిమి వేశారు ఎంపీడీవో పరిపాలన భవనం వెనుక వైపు ఐకెపి గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన భవనాలు ఉన్నాయి చుట్టుపక్కల అడవిని తలపించే విధంగా పొదల ఉండడంతో విషాసర్పాలతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు మహిళలు వాపోతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయం ముందున్న పొదలను తొలగించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### 120 మందికి రక్త పరీక్షలు.. 33 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



ముద్దనూరు, అక్టోబర్ 03: ప్రభాతవార్త:
సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు శ్రీకాంత్, కరీస్మా ఏర్పాట్లతో నిర్వహించిన ఈ శిబిరంలో ముద్దనూరుతో పాటు తిమ్మాపురం, కొత్తపల్లి ప్రాంతాల్లోనూ ఉచిత వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాల్లో సుమారు 120 మందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించగా, 33 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేపట్టారు. వీరిలో 25 మందికి ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ తేజ ఆధ్వర్యంలో స్కానింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణులు, సాధారణ రోగుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సలహాలు అందించడమే శిబిరాల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు సూర్యకుమారి, హెల్త్ ఆఫీసర్ వై.ప్రసాద్ యాదవ్, పర్యవేక్షకులు రామారావు, శివగంగ, జాసన్, జగదీష్, సుకన్యతో పాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి ఏఎన్ఎం శాంతి భోజన ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువవుతాయని నిర్వాహకులు తెలిపారు.

## శనివారం ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూజలు



సుండుపల్లె, అక్టోబర్ 03,ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఎన్ జె ఆర్ కాలనీ ఆరోగ్యపురము లోవెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు తిరుమల వారం మూడోవారం సందర్భంగా ఈరోజు స్వామివారికి అభిషేకము పూల అలంకరణ అనంతరం ధూప దీప నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగినది తదుపరి దేవాలయంలో ఉన్నటువంటి మహాగణపతి స్వామి వారికి అభయస్థ ఆంజనేయస్వామి వారికి గరుడ స్వామి వారికి తులసి మాత అమ్మవారికి పూల అలంకరణం అనంతరం ధూప దీప నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగినది వచ్చిన భక్తులు తల లీలలు సమర్పించుకున్నారు వారి పేర గోత్రనామాలతో ఆశీర్వాద వచనాలు ఇచ్చి వారికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగినదని అర్చక స్వామి ఆము నాయక్ తెలిపారు.

## విద్యార్థులు ప్రత్యేక తరగతులకు తప్పక హాజరై మంచి ఫలితాలు సాధించాలి



లక్కిరెడ్డిపల్లి అక్టోబర్ 03 ప్రభాతవార్త
విద్యార్థులు ప్రత్యేక తరగతులకు తప్పక హాజరై మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల ప్రత్యేక అధికారి ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9 10 తరగతి విద్యార్థులతో ఆయన సమావేశమై మాట్లాడారు ఉదయము ఎనిమిది గంటలకు సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థులు ఈ తరగతులకు హాజరై మంచి ఫలితాలు సాధించాలన్నారు అంతేగాక ఈ ఏడాది కొంత సిలబస్ మారిందని విద్యార్థులు సిలబస్ పై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఫలితాలు పొందాలన్నారు కొత్త సిలబస్ విధానంపై ఉపాధ్యాయులు విద్యార్థులు మమేకమై అర్థమైన రీతిలో బోధించాలన్నారు పరీక్షలకు తప్పక హాజరై పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేష్ లెక్కలు మాస్టర్ శివరామకృష్ణ ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఏబీవీపీ



మదనపల్లెక్రైం, అక్టోబర్ 3, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అన్నమయ్య జిల్లా మదనపల్లి శాఖ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ అభిలాష్,అన్నమయ్య జిల్లా కన్వీనర్ మనోజ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయన్నారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం,అధిక ఫీజులు వసూలు చేయడం, పాఠశాలల్లోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు అధిక ధరలకు విక్రయించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థులపై శారీరక, మానసిక వేధింపులు జరగకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.ప్రాథమిక విద్యను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా మాతృభాషలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని,నిబంధనలకు విరుద్ధంగా, కనీస వసతులు లేకుండా నిర్వహిస్తున్న అనధికార పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు ఈ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రాయచోటి,అక్టోబర్ 03,ప్రభాతవార్త :
కరువు పరిస్థితుల్లో ప్రజలు త్రాగునీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, త్రాగునీటి పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్య శాఖ, యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం రోజున ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీ త్రాగు నీటి నిర్వహణ సిబ్బందితో కలసి చెన్నముక్కపల్లెలోని త్రాగు నీటి వనరులను సందర్శించి పరిశీలించారు. నీరు కలుషితం కావడం వల్ల విరేచనాలు, టైఫాయిడ్, కలరా, కామెర్లు, హెపటైటిస్ఏ, హెపటైటిస్ఈ తదితర నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి వనరులు కలుషితం కాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు త్రాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చి లేదా శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని, నీటిని నిల్వ చేసే పాత్రలను శుభ్రంగా ఉంచాలని, వాటికి మూతలు తప్పనిసరిగా పెట్టాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు కలుషితం కాకుండా తగిన పారిశుద్ధ్య చర్యలు పాటించాలని కోరారు.నీటి ట్యాంకర్ల నిర్వాహకులకు ముఖ్య సూచన ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేసే నీటి ట్యాంకర్లు, వాటర్ ప్లాంట్లు మరియు ఇతర నీటి విక్రయదారులు సురక్షితమైన, నాణ్యమైన నీటినే సరఫరా చేయాలని విశ్వనాథరెడ్డి సూచించారు. నీటి వనరు, నీటి నిల్వ ట్యాంకులు, రవాణా చేసే ట్యాంకర్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కలుషితమైన లేదా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నీటిని త్రాగునీటిగా విక్రయించడం, సరఫరా చేయడం జరిగితే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. గ్రామాల్లో సరఫరా అవుతున్న నీటిని కొనుగోలు చేయకుండా, నీటి నాణ్యతపై అనుమానం ఉంటే సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు."నీరు జీవనా ధారం – సురక్షితమైన నీరు ఆరోగ్యానికి రక్షణ. నీటిని పొదుపుగా వాడుదాం, కలుషిత నీటికి దూరంగా ఉందాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అని యర్ర పురెడ్డి విశ్వనాథరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నము క్కపల్లె2 ఏయన్ యం.యం.సులోచన, ఆశా కార్యకర్తలు కె.సునంద, ఎ.ఉమాదేవి, గ్రామ పంచాయతీ నీటి నిర్వహణ ఉద్యోగులు చిన్నయ్య, షేక్ ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## 4600 క్వింటాళ్ల విత్తనం శనిగలు మంజూరు

### 35 శాతం సబ్సిడీతో, ఎకరాకు 40 కేజీలు, సోమవారం నుండి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి



రాజుపాలెం, అక్టోబర్3, ప్రభాతవార్త.
మండలానికి 4600 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనం శనిగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వము నిర్ణయించిన క్వింటాళ్ల శనగల ధర రూ. 9000 లు కాగా ప్రభుత్వం 35శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నట్లు, సబ్సిడీ పోను రైతులు చెల్లించవలసిన ధర రూ. 5850లు ఉంటుందని, ఎకరాకు 40 కేజీల చొప్పున, అత్యధికంగా 5 ఎకరాలకు 200 కేజీలు విత్తనం శనగలను అందించనున్నట్లు ఆయన తెలిపారు. శనగ పంట సాగుచేయు రైతులు సోమవారం నుండి రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి గ్రామవ్యవసాయ అధికారి దగ్గర పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నంబరు, లింకు అయిన సెల్ ఫోను తీసుకెళ్లి వారి పేర్లను నమోదు చేసుకోవాలని మండలవ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### 6బాటిల్స్ స్వాధీనం

### ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్



సిద్ధవటం అక్టోబర్ 3 ప్రభాతవార్త :
అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 6 మద్యం బాటిల్స్ స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు మండల కేంద్రమైన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లోఆయన శనివారం మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కడప చెన్నై జాతీయ రహదారి శివునిపల్లి సమీపాన కడప ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, సిద్ధవటం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేయగా నరసయ్య అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తుండగా అతని వద్ద నుండి 6 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు అలాగే సిద్ధవటం ప్రొహిబిషన్ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 5 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు అక్టోబర్ 6 వరకు పొడిగించినట్లు ఎవరైనా ఆసక్తిగల దరఖాస్తుదారులు సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని సిఐ రాజశేఖర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా ముగిసిన మండల స్థాయి క్రీడా ఎంపికలు



నందలూరు , అక్టోబర్ 3 ప్రభాతవార్త :
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండల కోఆర్డినేటర్ ఎన్. గౌరీ ఆధ్వర్యంలో జరిగిన నందలూరు మండల స్థాయి క్రీడా ఎంపికలు శనివారంతో ఘనంగా ముగిశాయి.మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు శనివారం ఖోఖో క్రీడలో తమ ప్రతిభను చాటారు.ఈ సందర్భంగా రాయచోటి డిప్యూటీ డిఇఓ ఎల్. నాగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణలు విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని వారు చెప్పారు.మూడు రోజుల పాటు జరిగిన మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు కోఆర్డినేటర్ గౌరీని వారు అభినందించారు.గత మూడు రోజులుగా నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు బాలికల జూనియర్ కళాశాలలో కబడ్డీ, వాలీబాల్, యోగ, బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, ఖోఖో తదితర విభాగాలలో అండర్ 17, 14 సంవత్సరాల బాలబాలికలకు వేరువేరుగా ఈ క్రీడా పోటీలను నిర్వహించారు.మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు డివిజనల్ లెవెల్ పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించారు.కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్,పెంచలయ్య, ప్రభాకర్, బుచ్చిబాబు, బోగా వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన అయ్యప్ప స్వామి సేవ సంఘం



గోపవరం. అక్టోబర్ 3. ప్రభాతవార్త
బద్వేల్ పట్టణంలో నెల్లూరు రోడ్డు లో వెలసియున్న శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం మరియు ఓంకార క్షేత్రం సంబంధించిన అభివృద్ధి కొరకు రాబోవు కార్తీకమాసం దృష్టిలో పెట్టుకొని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం కమిటీ తరఫున మరియు ఓంకార క్షేత్రం కమిటీ తరఫున మన ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డినీ కమిటీ సభ్యులు కలవడం జరిగినది. వినతి పత్రం ఇవ్వడం జరిగినది. దానికి మంత్రివర్యులు స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేయడం జరిగినది. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పైన తెలిపిన రెండు ఆలయాల డెవలప్మెంట్ గురించి వెంటనే స్పందించి పని పూర్తి చేయమని ఓఎస్డిని ఆదేశించారు. ఇందుకు ఆయనకు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ తరఫున ఓంకార క్షేత్రం కమిటీ తరఫున మరియు బద్వేల్ హిందూ బంధువుల తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అక్టోబర్ 10న శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో హాకథాన్ పోటీలు



మదనపల్లెక్రైం, అక్టోబర్ 3 ప్రభాతవార్త.
మదనపల్లె పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 10వ తేదీన కంప్యూటర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై హాకథాన్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ వెల్లడించారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు నిర్వహించే ఈ పోటీలకు పట్టణంలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

నందలూరు ,అక్టోబర్ 03 ప్రభాతవార్త :
మండల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఆదివారం నాడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ పీవీ నరసింహారావు తెలిపారు. డాక్టర్ పీవీ నరసింహారావు సహకారంతో శ్రీ శ్రీనివాస మల్టీ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. నందలూరు మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పీవీ నరసింహారావు కోరారు. వైద్య శిబిరానికి డాక్టర్ బైన శ్రీనివాస్ జనరల్ సర్జరీ, మూత్రపిండ వ్యాధుల నిపుణులు, డాక్టర్ అంపా బత్తిని గౌరీ గుండె వైద్య నిపుణులు హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కసనూరు, సింహాద్రిపు రంలో ప్రత్యేక క్యాన్సర్ వైద్య శిబిరాలు

పులివెందుల, అక్టోబర్ 3 ప్రభాతవార్త :
ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలోని హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో పులివెందుల నియోజకవర్గంలో ప్రత్యేక క్యాన్సర్ ముందస్తు గుర్తింపు, వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కసనూరు గ్రామంలో అక్టోబర్ 5న మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో శిబిరం నిర్వహించనున్నారు. అలాగే సింహాద్రిపురంలో అక్టోబర్ 6, 7 తేదీల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగనున్నాయి. రెండు ప్రాంతాల్లోనూ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో వైద్య చికిత్స పొందే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## కుక్కపాముకాటు, హెచ్. పి. వి. వ్యాక్సిన్, కుష్ఠు పై విద్యార్థులకు అవగాహన

### డిప్యూటీ. హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ




పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లాలోని సదుం మండలంలో కుక్కకాటు, పాముకాటు మరియు హెచ్. పి. వి. టీకాల(గర్భశయ ముఖద్వార క్యాన్సర్, నివారణ టీకాలు )కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహనా సదస్సు పాలమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యులు డాక్టర్ గాయత్రి,హెచ్. ఎమ్. నిరంజన్ ఆధ్వర్యంలో డి. ఎమ్. హెచ్. ఓ. ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మాట్లాడుచు భారతదేశం లో పాముకాటు భాధితులలో మన రాష్ట్రము రెండో స్థానంలో ఉందని వీటి వల్ల జరిగే అనారోగ్యం, మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ముక్యంగా కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల పాముకాటుకు గురికాకుండా ఉండవచ్చు అన్నారు. రాత్రి వేళ పొలాలకు వెళ్ళు రైతులు టార్చిలైట్ లేదా ఎమర్జెన్సీ లైట్ తీసుకెళ్ళాలి. పొలం లోకి వెళ్ళేటప్పుడు శబ్దం చేస్తూ వెళ్ళాలి, బొరియలు లేకుండా పూడ్చి వేయాలి, ఎలుకలు లేకుండా చర్యలు చేపట్టాలి. పాముకాటుకు గురి అయితే నాటు వైద్యం చేయకుండా 108అంబులెన్సు కు ఫోన్ చేయాలి. ఇప్పుడు 108అంబులెన్సులో పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటు కు గురి అయితే గాయాన్ని సబ్బు నీటితో బాగా 15నిముషాలు పాటు కడగాలి. ఇలా చేయడం వల్ల వైరస్ పైన ఉన్న పొర నాశనం అయి వ్యాధి తీవ్రత 70శాతం తగ్గుతుంది. దగ్గర లోని పి. హెచ్. సి కి వెళ్లి ఇంజక్షన్ (ఎ. ఆర్. వి )చేయించుకోవాలి. ఉచితంగా వేస్తారు. పెంపుడు కుక్కలకు టీకాలు పశువుల హస్పటల్ లో వేయించాలి. గర్భశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా 14సంవత్సరాలు పూర్తి అయి 15సంవత్సరాల లోపు అమ్మాయిలకు హెచ్. పి. వి. (హ్యూమన్ పాపిలోమా వైరస్ )టీకాలు ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల పర్యవేక్షణలో వేస్తున్నామని ఆన్లైన్ చేసి సర్టిఫికెట్స్ కూడా ఇస్తున్నామని తెలిపారు. ప్రపంచ దేశాలలో రొమ్ము, గర్భసయ క్యాన్సర్ లలో మనదేశం రెండవ స్థానంలో ఉందని కావున ఈ అవకాశం తల్లితండ్రులు తెలుసుకుని వారి ఆడపిల్లలకు వేయించుకోవాలని పిలుపునిచ్చారు.కుష్ఠువ్యాధి ఒక బాక్టీరియా వల్ల వస్తుందని, దేవుని శాపం వల్లగాని గత జన్మ లో చేసిన పాపం వల్ల గాని రాదని తెలిపారు. స్పర్శ, నొప్పి, నవ్వ లేని మచ్చలు శరీరంపై రాగి రంగులో ఉండి మిన, మిన, మెరుస్తూ ఉంటాయి. ఈ రకపు మచ్చలను తొలిదష లోనే గుర్తించి చికిత్స పొందితే అంగవైకల్యం రాదనీ తెలిపారు. కుష్ఠువ్యాధికి చికిత్స, పరీక్షలు పూర్తిగా ఉచితంగా అన్ని ప్రభుత్వ అస్పత్రులలో ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ,ఎమ్. ఎల్. హెచ్. పి. నఫీసా ఏ. ఎన్. ఎమ్. ఓబుళమ్మ, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరీ వద్దు.. ఎస్సీ రిజర్వేషన్‌యే కావాలి



కడప కార్పొరేషన్ అక్టోబర్ 3 ప్రభాత్ వార్త:
బేడ బుడగ జంగం కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని బేడ బుడగ జంగం హక్కుల పోరాటా సమితి జిల్లా నాయకులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి విమర్శించారు. శనివారం కడప పాత రిమ్స్ బీసీ భవన్‌లో విలేకరులతో సమితి జిల్లా నాయకుడు పస్తం అంజి మాట్లాడుతూ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు బుడగ జంగాలకు ఎస్సీలతో సమానంగా సంక్షేమ ఫలాలు అందిస్తామని ప్రకటించారని, అధికారులు ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరీ కింద ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పడం సరికాదన్నారు. తమకు ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరీ వద్దని, రాజ్యాంగబద్ధంగా రావాల్సిన ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి కుల ధ్రువీకరణ పత్రాలు లేక తమ పిల్లల భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాయమాటలకు స్వస్తి చెప్పి ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. లేనియెడల ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు సి. పెంటయ్య, పి. పెద్ద గంగులు, సి. చిన్న వెంకటయ్య, పి.శ్రీను, సి.చంద్రశేఖర్, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

## దొంగలించబడ్డ సొత్తు లభ్యం

### రాజనాలబండ మహిమగా పూజలు



చౌడేపల్లి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:
పోయిందనుకున్న బంగారం గొలుసు లభ్యం కావడంతో స్వామి వారి వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు బాధిత వ్యక్తి కథనం మేరకు...పీలేరు గ్రామానికి చెందిన గ్రామస్తులు సెప్టెంబర్ 19న 30 గ్రాముల బంగారు గొలుసు ఇంటి నుంచి దొంగతనం జరిగిందని ప్రమాణం చేయడానికి వచ్చి రసీదు పొందారు ఈ క్రమంలో శనివారం తిరిగి ప్రమాణకానికి వస్తామని గ్రామంలో చెప్పగా అదే గ్రామానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తులు సదరు గొలుసును బాధిత వ్యక్తి ఇంటి ముందర ఉంచి వెళ్లిపోయారు బాధిత వ్యక్తి కుమారులు రాజనాలబండ దేవస్థానానికి విచ్చేశారు. ఇంట్లో ఉంచిన 30 గ్రాముల బంగారు గొలుసు సురక్షితంగా దొరకడంతో దేవస్థాన సన్నిధికి తీసుకువచ్చి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ప్రసన్న ఆంజనేయస్వామి లకు అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు అనంతరం ఆభరణాన్ని భద్రంగా తీసుకుని స్వగ్రామానికి పయనమయ్యారు.

## ఆసుపత్రి రోగుల అటెండర్లకు పాసుల పంపిణీ



మదనపల్లెక్రైం, అక్టోబర్ 3 ప్రభాతవార్త:
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల భద్రత, మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రోగుల అటెండర్లకు పాసులను పంపిణీ చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మసూద్, ఆర్ఎంఓ డాక్టర్ రాధిక తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి నిబంధనల ప్రకారం అటెండర్ పాసు ఉన్నవారికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి రోగితో పాటు ఒక అటెండర్‌కు మాత్రమే లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 9:00 గంటల నుండి 10:00 గంటల వరకు డాక్టర్లు వార్డుల సందర్శన (రౌండ్స్) సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించమన్నారు. ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి రోగుల సం బంధీకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలత, సెక్యూరిటీ ఎస్ఓ గణేష్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## వేంపల్లెలో దుర్గమ్మ ఆశీస్సులతో మెరుగుపడిన భక్తుడి ఆరోగ్యం



వేంపల్లి, అక్టోబర్ 03, ప్రభాతవార్త
దుర్గమ్మ తల్లి మహిమలు భక్తుల ఆరోగ్యం, శారీరక, మానసిక రుగ్మతలను తొలగించడంలో అమితమైనవిగా నమ్మబడతాయని,హైందవ సంప్రదాయంలో దుర్గాదేవిని రోగహరిణి అని పిలుస్తారని భక్తుల నమ్మకానికి వేంపల్లెకు చెందిన భక్తుడు చిట్టెంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి నిదర్శనంగా నిలిచారు.వేంపలెల్లో శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఆయన మాట్లాడుతూ ఆయన డయాలసిస్ తో బాధపడుతున్నానని మార్చిలో వేంపల్లెలోని సాయినగర్లో మార్చిలో నిర్మించిన శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారిని ప్రతిష్టించినప్పటి నుండి ప్రతి రోజు సాయంత్రం దుర్గమ్మతల్లిని దర్శించుకుని గర్భగుడి చుట్టూ ప్రదక్షి ణలు తన ఆరోగ్యంపై మెరుగుపడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.వారానికి 2 సార్లు డయాలసిస్ కు వెళ్లేవారు.3 నెలల నుండి ఆరోగ్యం మెరుగుపడిందని డయాలసిస్ కు వెళ్లడం లేదని తెలిపారు.వేణుగోపాల్ రెడ్డికి ఆరోగ్యం మెరుగుపడడంతో డాక్టర్లు కూడా ఆశ్చర్యంకు గురయ్యారని తెలిపారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ఓ భక్తుడికి ఆరోగ్యం బాగు అవ్వడం అంటే అమ్మవారు ఎంతో మహిమ కలిగిందని తెలిపారు.వివాహాలు కానీ యువకులు ఈ మధ్య అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత వివాహాలు కూడా జరిగాయని తెలిపారు.అమ్మవారిని భక్తితో కొలిస్తే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని,మానసిక ప్రశాంతత లభిస్తుందని అనేక మంది భక్తుల నమ్మకానికి ఆరోగ్యంపై దుర్గమ్మ తల్లి మహిమ కలదని తెలిపారు.కావున భక్తులు దుర్గమ్మను దర్శించుకుని తమ కోరికలు తీర్చుకొనేందుకు ప్రత్యేక పూజలు చేసుకోని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.వేంపల్లెకు చెందిన బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య మాట్లాడుతూ దుర్గమ్మ దేవస్థానం వారి స్థలం కొని ప్లాట్లుగా ఏర్పర్చి విక్రయించడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం ఉన్న మార్కెట్లో ధరలు కూడా లేకపోయిన అమ్మవారి ఆశిస్సులతో అధిక రావడం జరిగిందన్నారు. దుర్గమ్మ తల్లిని భక్తితో కోరికలు కోరగా నెరవేరుతాయని తెలిపారు.

## చదువుతో పాటు క్రీడలు తప్పనిసరి

### కొత్తపేట జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్

ఖాజీపేట, అక్టోబర్ 3 ప్రభాతవార్త :
ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనాలని కొత్తపేట జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తెలిపారు. కొత్తపేట జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం ఎస్.జి.ఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కబడ్డి, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి డివిజనల్ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కడప జోయాలుక్కాస్ మేనేజర్ రూ.1.50 లక్షల రూపాయలను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎసిసి జిల్లా సెక్రటరీ విజయలక్ష్మి, అప్పనపల్లె, ఖాజీపేట ప్రధానోపాధ్యాయులు, పి.ఇ.టి అనంద్, ఎస్ఎమ్సి ఛైర్మన్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి అంగన్వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ నిర్వహించాలి



**లక్కిరెడ్డిపల్లి అక్టోబర్ 03 ప్రభాతవార్త:** ప్రతి అంగన్వాడి కేంద్రంలోని సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమము నిర్వహించాలని అంగన్వాడి సూపర్వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు శనివారం స్థానిక కొనం పేట అంగన్వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వేజర్ హుస్సేనమ్మ మాట్లాడుతూ ఈనెల 7 తేదీ వరకు ప్రతి అంగన్వాడి సెంటర్ లోనూ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించాలని గర్భవతులకు,బాలింతలకు,చిన్న పిల్లలకు సరైన పోషకాహారు అందించాలని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గ్రుడ్లు, పదార్థాలు అందించాలన్నారు పిల్లల ఎదుగుదల కోసం సముతుల ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు లక్ష్మి దేవి, రత్నమ్మ, పుష్పవతమ్మ, సులోచన,మల్లేశ్వరి,ప్రేమ కుమారి, ఆశా వర్కర్ పద్మావతి, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

## శ్లోకా పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



**వేంపల్లె, అక్టోబర్ 03, ప్రభాతవార్త :** స్థానిక శ్లోకా పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి వెల్లడించారు. శనివారం ఆ పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా తాత, అమ్మమ్మల మధ్య పిల్లలు పాల్గొన్నారు. అలాగే మనవడు, మనవరాళ్లు తమ తాత, అమ్మమ్మ కోసం ప్రత్యేక నృత్యాలు, ఆటలు, పాటలు, పద్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బండి నవనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల జీవితంలో తమ తాత, అమ్మమ్మల పాత్రను గౌరవిస్తూ.. వీరి మధ్య ఉన్న అమూల్యమైన బంధాన్ని గుర్తు చేసుకునేందుకు ఈ వేడుకలు దోహద పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు

### కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి



**మదనపల్లె, అక్టోబర్ 3 ప్రభాతవార్త :** కమ్యూనికేషన్ సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉద్యోగాలు సులభతరంగా పొందవచ్చునని ఆద్యిత ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. శనివారం ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ-అకాడమియా లీడర్స్ కాన్క్లేవ్ వారు విద్యార్థులకు పరిశ్రమల అవసరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలు, కేరీర్ అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసి విద్యార్థులను పరిశ్రమలకు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు పరస్పరం కలిసి పనిచేసినపుడే విద్యార్థులు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను సాధించగలరన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సురేష్, మేనేజర్ అరుణ్‌శర్మ, కన్నల్ శ్రీరామన్, రాజాబలరామ్‌లు మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రస్తుతం ఉన్న అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, డేటా-ఏఐ రంగ అభివృద్ధి, కేరీర్ ప్రణాళిక-పరిశ్రమలకు అనగుణమైన విద్యావిదానాలపై విద్యార్థులకు మార్గదర్శకం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాముడు, వివిద విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఈ.సీ. గంగిరెడ్డి సేవలు చిరస్మరణీయం

### వైఎస్ భారతీరెడ్డి ఘన నివాళి



**పులివెందుల, అక్టోబర్ 3, ప్రభాతవార్త** పులివెందుల ప్రాంతంలో ప్రముఖ వైద్యులుగా, పేదల పట్ల అపారమైన సేవా భావంతో జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఈ.సీ. గంగిరెడ్డి ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం డాక్టర్ ఈ.సీ. గంగిరెడ్డి సమాధి వద్ద ఆయన కుమార్తె వైఎస్ భారతీరెడ్డి, డాక్టర్ సుగుణమ్మ, డాక్టర్ దినేష్ తదితరులు పుష్పాంజలి ఘటించి ఆయన పవిత్ర స్మృతిని స్మరించుకున్నారు.డాక్టర్ ఈ.సీ. గంగిరెడ్డి పులివెందుల ప్రాంత ప్రజలకు విశేష వైద్య సేవలు అందించారని, ముఖ్యంగా పేదలు, నిరుపేదలకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో సేవలందించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా ప్రజాసేవకు ఒక మార్గంగా భావించి, అనేక మందికి ఆరోగ్యాన్ని అందించేందుకు కృషి చేశారని తెలిపారు.పేదల పట్ల ఆయన చూపిన ఆప్యాయత, సేవా తత్వం, మానవతా విలువలు నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన అందించిన వైద్య సేవలను, సమాజం పట్ల చూపిన బాధ్యతను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. డాక్టర్ ఈ.సీ. గంగిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. ఆయన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.

## పులివెందుల వైసీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ



**పులివెందుల, అక్టోబర్ 3 ప్రభాతవార్త :** పులివెందుల పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పట్టణ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యక ర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యకర్తల కు గుర్తింపు కార్డులను అందజేసిన వైఎస్ మనోహర్‌రెడ్డి, పార్టీ కార్యక్రమాలను సమన్వ యంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించి నట్లు తెలిపారు. ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వీఆర్ఏల నిరసన కార్యక్రమం



**పెండ్లిమర్రి, అక్టోబరు 3, ప్రభాతవార్త:** వీఆర్ఏలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత 18 రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని వీఆర్ఏల సంఘం అధ్యక్షులు అబ్రహం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారానికి నిరసన దీక్ష 14 రోజులకు చేరుకుందని పేర్కొన్నారు. వీఆర్ఏల పే స్కేల్ మరియు వీఆర్ఓలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీలకు వీఆర్ఏగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ రెవెన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేడికుర్తిలో జాతీయ సేవా పథకం 2026 ప్రారంభం



**పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త:** కలికిరి మండలం మేడికుర్తి గ్రామంలో ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల తిరుపతి ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (విఠీఠీ) 2026 కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఘనంగా ప్రారంభమైంది. అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దీతితిగిగి సెంటర్, చిత్తూరు మరియు కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి నుంచి మొత్తం 42 మంది విద్యార్థులు, 40 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్, హెడ్, విఠీఠీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. లత మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు వ్యవసాయం, సామాజిక అంశాలు మరియు సంబంధిత విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు గ్రామ ప్రజలతో మమేకమై వివిధ వ్యవసాయ, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని మేడికుర్తి గ్రామంలో నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల తిరుపతి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజురీ కలికిరి నుంచి డా. సోమశేఖర్, శాస్త్రవేత్త; డా. జి.ఎస్. పాండురంగ, అసిస్టెంట్ ప్రొఫెసర్; డా. టి. రామలక్ష్మి, విఠీఠీ ప్రోగ్రాం ఆఫీసర్; డా. ఎస్. రామలక్ష్మి దేవి, కలికిరి ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు. వారంపాటు జరిగే ఈ జాతీయ సేవా పథకం ద్వారా గ్రామ ప్రజలకు వ్యవసాయ సాంకేతికత, సామాజిక అంశాలు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు.

# పేదల ఇళ్ల నిర్మాణంలో వైకాపా, టీడీపీ దొందూ దొందే

### పులివెందుల మెగా లేఅవుట్‌పై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి విమర్శలు

### రూ.89 కోట్ల ప్రజాధనం ఖర్చయినా.. పేదలకు అందని ఇళ్లు : డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



**పులివెందుల, అక్టోబర్ 3 ప్రభాత వార్త :** పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రభుత్వాల పనితీరు దొందూ దొందేనని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు.

నివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పులివెందుల మెగా లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సొంత ఇల్లు ప్రతి మనిషి ఆశయమని, ముఖ్యంగా పేద కుటుంబానికి సొంత గృహం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఇందిరాగాంధీ స్ఫూర్తితో 2004-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు సుమారు 60 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చాయని వారు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ప్రభుత్వాలు పేదల గృహ నిర్మాణంపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. పులివెందుల మెగా లేఅవుట్ ఇందుకు ఉదాహరణగా నిలుస్తోందన్నారు. ఈ కాలనీలో మొత్తం 6,950 ఇళ్లు మంజూరు కాగా, రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొమెర రామచంద్ర సంస్థ, శ్రీ వినాయక కన్స్ట్రక్షన్స్, డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలకు నిర్మాణ పనులు అప్పగించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 6,950 ఇళ్లకు గాను 951 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, వాటిలో ఒక్క కుటుంబం కూడా నివాసం ఉండటం లేదని పేర్కొన్నారు. మరో 1,735 ఇళ్లు పునాది స్థాయిలో, 1,988 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో, 1,920 ఇళ్లు ఆర్సీ లెవెల్‌లో ఉన్నాయని వివరించారు.ఇళ్ల నిర్మాణానికి ఇప్పటివరకు సుమారు రూ.89 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులు ప్రారంభం కాలేదని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేద న్నారు.పులివెందుల మెగా లేఅవుట్‌పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని తులసిరెడ్డి, డిమాండ్ చేశారు. ఆరు నెలల్లో కాలనీ పనులను పూర్తిచేసి అర్హులైన పేదలకు ఇళ్లను అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వాసుదేవరెడ్డి, ఏఈ రామసూ రారెడ్డి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు కాంగ్రెస్ పార్టీ పులివెందుల మండల అధ్యక్షుడు ఖాదర్ భాషా, లింగాల మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, వేంపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, అనూష, జిలానీ, శంకర్, నాగరాజు, వెంగల్‌రెడ్డి, నూర్‌భాషా, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, బద్రి, రాఘవయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా వైద్య శిబిరం



**దువ్వూరు, అక్టోబర్ 03, ప్రభాతవార్త:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల నిస్వార్థ సేవ సందర్భంగా సేవా సంకల్ప అభయాన్ కింద మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ సురేష్ బాబు, హేమలతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవ చేయడం, వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స అందించడం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. సేవా సంకల్ప అభయాన్ మెగా వైద్య శిబిరాన్ని ఉచితంగా నిర్వహించామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో వైద్య శిబిరాలు కీలకపాత్ర పోషిస్తాయి అన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీరాంజనేయులు, రాజేశ్వరి, జనార్దన్ రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం



**కలికిరి,అక్టోబర్ 3 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని కలికిరి మండలం మరికుంటపల్లె, మేడుకుర్తి సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఉత్సవాలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో తల్లులను ఉద్దేశించి మనం తీసుకునే ఆహారంలో ఐరన్, ప్రోటీన్స్, మినరల్స్, క్యాల్షియం ఆహారం ప్రతిరోజు తీసుకోవాలని తెలిపారు అలా తీసుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాము. కుటుంబం యొక్క ఆరోగ్య పై ఆడవాళ్ళకి మంచి అవగాహన కలిగి ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతిఅంగన్వాడీ లోను ఈనెల 8వ తేదీ వరకు నిర్వహి స్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుంధతి టీచర్స్ హెల్పర్స్ తల్లులు హాజరయ్యారు.

# తాగునీటి బోరు కేబుల్ వైర్ చోరీ 6 సార్లు వరుస దొంగతనాలు

**రామసముద్రం అక్టోబర్ 3 ప్రభాతవార్త** మండలంలోని కె.సి.పల్లి పంచాయతీ పరిధిలోని వనగానిపల్లి గ్రామసమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాగునీటి బోరు కేబుల్ వైర్ ను చోరీ చేశారు.మోటారు నుంచి స్టార్టర్ వరకు ఉన్న కేబుల్ వైర్ ను కోసి ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం బోరు వద్దకు వెళ్లిన గ్రామస్తులు వైర్ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు.ఇప్పటికే ఇదే బోరు వద్ద ఆరుసార్లు కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస చోరీలతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

## జమ్మలమడుగు శాఖ గ్రంథాలయానికి రూ.10వేలు విలువైన పుస్తకాల ర్యాక్‌లు విరాళం




**జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జమ్మలమడుగు శాఖా గ్రంథాలయానికి పుస్తకాలను క్రమబద్ధంగా భద్రపరచేందుకు అవసరమైన రూ.10వేలు విలు వైన మూడు పుస్తకాల ర్యాక్‌లను కుండా భాస్కర్ (టీచర్) విరా ళంగా అందజేశారు. గ్రంథాలయ అవసరాన్ని గుర్తించి ర్యాక్‌లను అందించడం పట్ల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డా.ఎం.ఎల్.నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎం.కృష్ణారెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండారు శ్రీనివాసులు కుండ భాస్కర్‌ను అభినందించి ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి అమీర్ బాషా, టీచర్ మాధవ్, మధుసూదన్ శర్మ, అక్కంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎగువపల్లి విద్యార్థినిలకు హెచ్‌పీవి వాక్సినేషన్

**పెండ్లిమర్రి, అక్టోబరు 3, ప్రభాతవార్త:** పెండ్లిమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవిప్రసాద్ వారి సిబ్బంది తిమ్మారెడ్డి,మోనిక,సంధ్యల ఆధ్వర్యంలో ఎగువపల్లి విద్యార్థినిలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. విద్యార్థినిలు 3మందికి గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిరోధక వాక్సిన్ హెచ్పీవి వేసారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సలీంబేగ్ మాట్లడుతూ విద్యార్థినులు ఆరోగ్యం,భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఎంతో ఖర్చుతో తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు గునిశెట్టి శ్రీనివాసులు, రామకృష్ణా రెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# డిపో మేనేజర్ ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా నిరవధిక నిరసన



**పీలేరు అక్టోబర్ 3 ప్రభాతవార్త:** డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎన్ఎంయుఏ అధ్యక్ష, కార్యదర్శులు సివి రమణ, జి. ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరవుతూ స్థానిక బస్టాండులో నిరసన తెలుపుతూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. డిపోలో అక్రమ బదిలీలు, పనిష్మెంట్లు ఆపాలని, ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సెటిల్‌మెంట్లు ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎండీ జారీ చేసిన 1/19 సర్క్యులర్‌ను అమలు చేయకుండా డిపో మేనేజర్ సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగులతో, ముఖ్యంగా హెడ్‌క్లర్క్‌లు, కార్మికులు తమ సమస్యలు చెప్పినప్పుడు అవహేళనగా మాట్లాడటం, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉద్యోగులతో అధిక గంటలు పని చేయిస్తున్నారని పేర్కొన్నారు. పీలేరు నుంచి నడిచే లాంగ్ సర్వీసులను నిలిపివేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆర్టీసీకి నష్టం వాటిల్లేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. అసోసియేషన్ సభ్యులతో సంప్రదించకుండా సర్వీసుల్లో మార్పులు చేయడం నిలిపివేయాలని కోరారు. ఆగస్టు 2న సమర్పించిన వినతిపత్రంపై చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 3 నుంచి తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సంఘం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి పత్రికలు, ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫాతిమా పాఠశాలలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** వన్యప్రాణుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా బద్వేలు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఫాతిమా పాఠశాలలో శనివారం వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నయీమ్ అలీ మాట్లాడుతూ వన్యప్రాణుల ప్రాముఖ్యత, జీవవైవిధ్య పరిరక్షణ, అడవులు, వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులకు సంబంధించిన సమస్యలు, సంఘటనలు ఎదురైనప్పుడు అటవీ శాఖకు సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18004255909ను వినియోగించాలని సూచించారు.విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణకు అంబాసిడర్లుగా వ్యవహరించి, తమ పరిసరాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

## గ్రామపంచాయతీలను ఎంపీడీవో తనిఖీ



**నిమ్మనపల్లి అక్టోబర్ 3, ప్రభాతవార్త:** అన్నమయ్య జిల్లా, నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీలలో ఎంపీడీఓ ఫక్రుద్దీన్ సాహెబ్ ఆకస్మిక తనిఖీ చేస్తూ ఐవిఆర్ఎస్‌కాల్స్ గురించి స్థానిక ప్రజానీకానికి అవగాహన కల్పించుతూ..ప్రతి రోజూ గ్రీన్ అంబాసిడర్లు మన గ్రామాలలో ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్త బిన్ బ్యాగ్ పద్ధతిలో గృహస్తులు ఇచ్చే విధంగా శిక్షణ ఇచ్చియున్న సంగతి విధితమే.. చెత్త నుండి సంపద తయారు కేంద్రం పనితీరు తనిఖీ, ..స్వచ్ఛరథం.. మీ గ్రామానికి వస్తుంది అపుడు ఆపరేటర్ వారికి గుజిరి ఇస్తే సరిపడా మొత్తానికి నిత్యావసర సరుకులు పొందాలని..ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందో అని ఈనెల 5వ తేది నుండి 9వ తేది వరకు ప్రభుత్వం నుండి గ్రీన్ అంబాసిడర్లు చెత్త సేకరణకు వస్తున్నారా! కనీసం వారానికి రెండు మార్లు వస్తున్నారా! స్వచ్ఛ రథం మీ గ్రామానికి వస్తుందా! వారికి గుజిరి అమ్ముతున్నారా! అనే ప్రశ్నలు అడిగినచో.. అన్నింటికీ అవును అనే మీ మొబైల్ లో 1 నొక్కండనీ.. ప్రతి ఒక్కరూ ఈ అంశాన్ని సహృదయంతో స్వీకరించి మండలాన్ని ప్రగతి బాటలో తెచ్చేందుకు సహకరించగలరనీ, ముఖ్యంగా దసరా ధమాకా క్రింద ఎవరైనా 10 కేజీల పైబడి గుజిరి ఇస్తే అటువంటి వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు గురించి కూడా వివరించడమైనది , సదరు కార్యక్రమంలో బాలరాజు డిప్యూటీ ఎంపీడీఓ, పీడీఓలు రజిత, గాయత్రి, స్వర్ణ గ్రామం సిబ్బంది, స్వచ్ఛ రథం వారు, స్థానికులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ నైపుణ్యాల పెంపుదల తప్పనిసరి: పిడిజె

**కడప లీగల్ అక్టోబర్ 3 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచనల మేరకు కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి .రామ్ గోపాల్ ఆధ్వర్యంలో కడప యూనిట్ నందు గల జిల్లా న్యాయమూర్తులందరికీ జిల్లా కోర్టు ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ నైపుణ్యాల పెంపుదల స్థాయి 1 మరియు స్థాయి 2 లపై కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ యొక్క అవలోకనం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్,రోజువారీ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో పని చేయడం, వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు కేసుల హైబ్రిడ్ విచారణ, సైబర్‌స్పేస్‌లో పని చేయడం, నెట్‌వర్కింగ్, డేటా భద్రత మొదలగు అంశాలపై మాస్టర్ ట్రైనర్ మరియు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ జి సి ఆసిఫా సుల్తానా, మాస్టర్ ట్రైనర్ అండ్ జూనియర్ సివిల్ జడ్జ్ కమలాపురం ఎస్ మధుసూదన్ రావు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని న్యాయమూర్తులు అందరూ పాల్గొనడం జరిగినది.

## కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



**పెండ్లిమర్రి, అక్టోబరు 3, ప్రభాతవార్త:** పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు మరియు ఉలవలపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదిన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కడప జిల్లా బీజేపీ కిషన్ ఉపాధ్యక్షుడు కమలాపురం అసెంబ్లీ ఇన్‌ఛార్జి సంగటి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగేటి వెంకట సుబ్బారెడ్డి, ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ భానుప్రకాష్ చిత్తూరు జిల్లా బీజేపీ ఇన్‌ఛార్జి కె.లక్ష్మినారాయణరెడ్డి, సీనియర్ బీజేపీ పెండ్లిమర్రి మండలం బాల గురవయ్య పాల్గొని బాలింతలు మరియు గర్భవతులు, ఏఎన్ఎం ఆశా వర్కర్‌లు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తుమ్మలూరు అంగన్‌వాడీ కేంద్రంలో కె.వరలక్ష్మి, ఎల్.సునీత, ఉలవలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కె.వెంకటేశ్వరి, వి.రాదామనిలు సన్మానం చేయడం జరిగింది.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర కీలకం

### మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి



**జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జమ్మలమడుగు మున్సిపాలిటీకి జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు ప్రథమ స్థానం సంపాదించడంలో జమ్మలమడుగు మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో లభించిన సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డిలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు వల్లే ఈ ఘనత లభించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, కూటమి నాయకులు, మున్సిపల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మలమడుగు మున్సిపాలిటీకి స్వచ్ఛ ఆంధ్ర-2026 జిల్లా స్థాయి అవార్డు



**జమ్మలమడుగు, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జమ్మలమడుగు మున్సిపాలిటీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026 జిల్లా స్థాయి పురస్కారం లభించింది. ఎస్ఏఎస్ఏ కార్యక్రమంలో పారిశుద్ధ్యానికి కలెక్టర్ డా.శ్రీధర్ చేతుల మీదుగా ఆ అవార్డు అందుకున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బ్రాండ్ అంబాసిడర్ భూపేష్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రజల సమిష్టి కృషితో ఇది సాధ్యమైందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. జమ్మలమడుగు పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామన్నారు.